క్లుప్తంగా

సఫాయి కర్మచారి సంఘం రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీగా రమేష్

మామునూరు: తెలంగాణ సఫాయి కర్మచారి సంఘం రాష్ట్ర అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా బొల్లికుంట శివారు రామకృష్ణాపురానికి చెందిన మారపెల్లి రమేష్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో జాతీయ ఫౌండర్, చైర్మన్ వీరరాజు నుంచి నియామక పత్రాన్ని రమేష్ అందుకున్నారు.

సుబ్బాచారికి వాసిరెడ్డి భాస్కర్‌రావు పురస్కారం

విద్యారణ్యపురి: అభ్యుదయ రచయితల సంఘం వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆచార్య వాసిరెడ్డి భాస్కర్‌రావు స్మారక సాహితీ పురస్కారం నవలల పోటీల్లో ఆచార్య పులికొండ సుబ్బాచారి 'రేపు తిరుగుపడితే' నవల ఎంపికైంది. ఈనెల 15న హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో నిర్వహించే సభలో విజేతకు రూ.5 వేల నగదుతోపాటు జ్ఞాపిక అందజేయనున్నట్లు వరంగల్ అరసం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బూర భిక్షపతి, డాక్టర్ మార్క శంకర్‌నారాయణ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో శిక్ష

కాజీపేట: కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి సామాజిక సేవ చేయాలని న్యాయమూర్తి కె.రాజశేఖర్ రెడ్డి తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ నాగబాబు కథనం ప్రకారం బర్నాడ్ హంగ్ లాజరస్.. ఇటీవల ట్రాఫిక్ పోలీసులకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు. ఈమేరకు న్యాయమూర్తి తీర్పు మేరకు లాజరస్ సామాజిక సేవ చేశారు.

సాంకేతిక కారణాలతో ఆగిన రోడ్డు పనులు

సాక్షి స్పందన

హసన్‌పర్తి: సాంకేతిక కారణాల వల్ల రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోయాయని 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత తెలిపారు. హడావుడి చేసి.. ఆపై వెనక్కి తగ్గి! అనే శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి కార్పొరేటర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023 సాధారణ ఎన్నికల తర్వాత పనులు చేపడతామని మధ్యలోనే నిలిపివేసినట్లు తెలిపారు. ప్రధాన రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయే వారికి ఇందిరమ్మ పథకం వర్తింపజేయాలని ఆమె కోరారు.

రైళ్లలో జనరల్ బోగీల పెంపు అభినందనీయం

కాజీపేట రూరల్: కేంద్రం రైళ్లలో ఎల్‌హెచ్‌బీ జనరల్ కోచ్‌ల పెంపు నిర్ణయం అభినందనీయమని రైల్వే జనరల్ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం కాలంగా రైల్వే జనరల్ బోగీల సాధన సమితి ఆధ్వర్యంలో జనరల్ బోగీలను పెంచాలని దేశవ్యాప్తంగా ప్రధానమంత్రికి కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని మొదలు పెట్టినట్లు గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా 370 రైళ్లలో వేయి సాధారణ బోగీలను పెంచితే లక్షమంది సాధారణ ప్రజలు ప్రయాణించే వీలుంటుందన్నారు.

రేపు షష్టి నోములు, బోనాలు

కాజీపేట: షష్టి సందర్భంగా షష్టి నోములు చేసుకునే వారు ఈనెల 7వ తేదీన బోనాలు చేసుకోవాలని అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఒక ప్రకటనలో కోరారు. శనివారం బోనాలు చేసుకుని ఆదివారం ఉదయం 7గంటలలోపు ఎత్తుకోవాలని సూచించారు.

అడ్డాల తొలగింపు షురూ

కాజీపేట: కాజీపేటలో రహదారులకు ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న చిరు వ్యాపారుల అడ్డాలను తొలగించాలని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్ణయించారు. గురువారం అధికారులతో పాటు డీఆర్‌ఎఫ్ సిబ్బంది దుకాణాల వద్దకు వెళ్లి ఫాతిమానగర్ నుంచి డీజిల్ కాలనీ వరకు ఉన్న దుకాణాదారులను వ్యక్తిగతంగా కలిసి 24 గంటల్లోగా తీసివేయాలని ఆదేశించారు. లేకపోతే జేసీబీ సాయంతో డబ్బాలను మున్సిపల్ సిబ్బంది కూల్చివేస్తారని స్పష్టం చేశారు. దీంతో చిరువ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

జర్నలిస్టు సుభాష్ కుటుంబానికి ఆర్థిక సాయం



వరంగల్: ఇటీవల అకాల మరణం పొందిన జర్నలిస్టు నాయకపు సుభాష్ కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అందించారు. ఈమేరకు కుటుంబ సభ్యులకు కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి గురువారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి రాజు, నాతి రవీందర్‌గౌడ్, మార్క విజయ్‌కుమార్, కార్పొరేటర్ రజిత, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కంకర పోసి వదిలేశారు

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం
- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు
- పేదల కాలనీల వైపు కన్నెత్తి చూడని ప్రజాప్రతినిధులు, అధికారులు



మార్కండేయ కాలనీకి వెళ్లే దారిలో కంకర పోసి వదిలేసిన రోడ్డు

మామునూరు: నగరంలోని 43వ డివిజన్ పరిధిలోని పేదలు నివసించే పలు కాలనీల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. వరంగల్ మహానగరంలో విలీనమై ఏళ్లు గడుస్తున్నా కాలనీలను అభివృద్ధి చేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమవుతున్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 43వ డివిజన్ పరిధిలో రాంగోపాల్‌పూర్, మంగళమ్మకుంట, పోలీస్ కాలనీ, నక్కలపల్లి, తదితర ప్రాంతాల్లో ఎక్కువశాతం పేదలు నివసిస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమను పట్టించుకోలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కనీస సదుపాయాలు కరువు

డివిజన్ పరిధిలో నిరుపేదలు నివాసముండే మార్కండేయ నగర్ (మంగళమ్మ కుంట), రాంగోపాల్‌పూర్‌లో ఇప్పటి వరకు అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు లేవు. కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికల నిర్మాణం కోసం గత ప్రభుత్వం సుమారు రూ.కోటి నిధులు మంజూరు చేసింది. నిధుల లేమితో పలు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అప్పటి పనులను పట్టించుకోకుండా కొత్త పనులకు శ్రీకారం చుడుతూ పేదల కాలనీ వైపు దృష్టి సారించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి వైపు దృష్టి సారించాలి



పేదలు నివాసముండే పలు ప్రాంతాల్లో కనీస సదుపాయాలు లేవు. దాంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తి పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలి. రాంగోపాల్‌పూర్ జంక్షన్‌లో హైమాస్ట్ లైట్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

\- యాదాల జగపతి, టెలికాం మాజీ సభ్యుడు, రాంగోపాల్‌పూర్

విజయోత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం



వరంగల్: ధర్నాలో పాల్గొన్న నాయకులు



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిరసన..

- ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి రమేష్

వరంగల్: కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ఇచ్చిన మాట ఉత్తదేనా అని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ప్రశ్నించారు. భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య (ఏఐఎఫ్‌డీడబ్ల్యూ) రాష్ట్ర కార్యదర్శి వంగల రాగసుధ మాట్లాడుతూ ప్రజాపాలన ఉత్సవాల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధన దుర్వినియోగానికి పాల్పడడం సరికాదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని డీఆర్‌ఓ విజయలక్ష్మికి అందజేశారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

హన్మకొండ అర్బన్: ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ఎంసీపీఐ (యూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాగార్జున, నీలం రవీందర్, మాస్ సావిత్రి, కర్ర రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూడోలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

మడికొండ: జూడో పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు మడికొండ సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. ఈనెల 3నుంచి 5వ తేదీ వరకు వరంగల్‌లోని కెమిస్ట్ భవన్‌లో జరిగిన 68వ ఎస్‌ఎఫ్‌జీఐ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూడో పోటీల్లో పాల్గొన్న ఏడుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించగా, ముగ్గురు వెండి పతకాలను కైవసం చేసుకున్నారని వివరించారు. ఈనెల 10నుంచి 16వ వరకు గుజరాత్ రాష్ట్రంలోని లూథియానాలో జరగనున్న 68వ ఎస్‌జీఎఫ్ఐ నేషనల్ జూడో పోటీల్లో వారు పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు, జోడో శిక్షకుడు నాగరాజు, పీడీ పద్మ, పీఈటీని గురువారం అభినందించారు.



తనుశ్రీని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు తనుశ్రీ

హసన్‌పర్తి: జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు హసన్‌పర్తి క్రీడాకారిణి శీలం తనుశ్రీ ఎంపికైంది. ఈనెల 1నుంచి 4వ తేదీ వరకు జేఎన్‌ఎస్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ అండర్ -17లో తనుశ్రీ పాల్గొని ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ పార్థసారథి తెలిపారు. ఈనెల 9నుంచి 14వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటున్నట్లు వివరించారు. ప్రస్తుతం తనుశ్రీ ఎస్వీఆర్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోందని అన్నారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో తనుశ్రీని కరస్పాండెంట్ శివకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా ఘంటసాల జయంతి



హన్మకొండ కల్చరల్: అమర గాయకుడు ఘంటసాల 102వ జయంతి వేడుకల సందర్భంగా గాయకులు పాడిన గీతాలకు ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. బుధవారం సాయంత్రం హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘంటసాల, నటశేఖర ఘట్టమనేని శివకృష్ణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రొఫెసర్ వెనుకపల్లి తిరుపతయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాయకులు పోతనచారి, గొబ్బెట సుధాకర్, రాంమూర్తి, టీవీ రమేష్, రంగు రఘుపతి, గుజ్జారి రమేష్, సనశ్రీ, మాధవి, ఉపేందర్, చోటు, భువన, న్యాయవాది పద్మావతి, నీరజ, సాగంటి మంజుల తదితరులు పాల్గొన్నారు.

గుట్కాల స్వాధీనం

హన్మకొండ చౌరస్తా: పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతి లేని రూ.79,800 విలువైన నిషేధిత గుట్కాలు, అంబర్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ తెలిపారు. పరకాల పట్టణంలోని సాయినగర్‌లో రేపాల చంద్రశేఖర్ గుప్తా నివాసంలో నిల్వచేసి ఉన్న పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని నిందితుడిని పరకాల పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు వివరించారు.

పదేళ్ల పాలనలో అభివృద్ధిలో వెనుకంజ

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, తదితరులు

కాజీపేట: బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. ఈక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం అంకితభావంతో శాయశక్తులా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాజీపేట 62వ డివిజన్ రహమత్ నగర్ కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు రాష్ట్రానికి నిధులు సాధించడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. తహసీల్దార్ బావ్‌సింగ్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమార్, సుంచు అశోక్, నాయకులు ఎండీ.అంకూస్, ఎంపీ.రాజు, సవిత, పాక భాస్కర్, సిరిల్ లారెన్స్, అరూరి సాంబయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి, మేయర్

వరంగల్: గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్పొరేటర్ ఓని స్వర్ణలత, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేష్, కూచన రవీందర్, ఓని భాస్కర్, శ్రీరంగం కృష్ణ, మోతీలాల్ నాయక్ పాల్గొన్నారు.

దేవాలయాలను అభివృద్ధి చేయాలి

వరంగల్: వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వర, రంగనాథ స్వామి దేవాలయాలను అభివృద్ధి చేయాలని కాశీ విశ్వేశ్వర, రంగనాథ ఆలయాల పరిరక్షణ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు కోరారు. ఈమేరకు మంత్రి కొండా సురేఖను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ఉండాలి



హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఎంఈఓ రవీందర్



హన్మకొండ అర్బన్: మాట్లాడుతున్న అనితారెడ్డి

హసన్‌పర్తి: దివ్యాంగులు చిన్నచిన్న లోపాలతో మానసికంగా కృంగకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని మండల విద్యాశాఖ అధికారి రవీందర్ సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. హెచ్ఎం సుమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం సంపత్, మహేందర్, వాసుదేవరెడ్డి, రాములు, వీరస్వామి, మమత, సీఆర్పీలు రమేష్, నాగరాజు, రజనీ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అండగా నిలవాలి

హన్మకొండ అర్బన్: మానసిక దివ్యాంగులకు ప్రతిఒక్కరూ అండగా ఉండాలని కేయూ పాలక మండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కారుకాల అనితారెడ్డి సూచించారు. అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ హంటర్‌రోడ్డులోని రోహిణి నర్సింగ్ కళాశాలలో మల్లికాంబ మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. బండ రామలీల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనితారెడ్డి మాట్లాడుతూ మానసిక దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగే విధంగా వారిని ప్రోత్సహించాలని కోరారు.

మట్టి పరీక్షలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీనారాయణ

- ఏడీఏ లక్ష్మీనారాయణ

కాజీపేట అర్బన్: మట్టి పరీక్షలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఏడీఏ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవం సందర్భంగా కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని రైతు వేదికలో మట్టి పరీక్షలపై కేంద్రీయ విద్యాలయ పాఠశాల విద్యార్థులు, రైతులకు గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఏడీఏ మాట్లాడారు. నేల ప్రత్యేకతను తెలుసుకున్నప్పుడే మట్టికనుగుణంగా పంటలను రైతులు పండించే అవకాశం ఉంటుందని వివరించారు. ఏ నేలలో ఎలాంటి పంటలు పండుతాయనే అవగాహన విద్యార్థి దశ నుండే ఉండాలని అన్నారు. కాజీపేట ఏఓ సంతోష్, ఈఓ భరత్, దర్గా సొసైటీ మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు, కడిపికొండ, భట్టుపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

6 గ్యారంటీలు.. 66 మోసాలు

- మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

మడికొండ: కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు.. 66 మోసాలతో అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తైనా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆరోపించారు. మడికొండ చౌరస్తాలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ కాలేదని, మడికొండ శివారులోని డంపింగ్ యార్డును తొలగించలేదని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, వర్ధన్నపేట నియోజకవర్గ అసెంబ్లీ యాత్ర ప్రముఖ్ బన్న ప్రభాకర్, జిల్లా యాత్ర సహప్రముఖ్ జలగం రంజిత్, పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హయగ్రీవాచారికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తదితరులు

హన్మకొండ చౌరస్తా: మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత హయగ్రీవా చారి వర్ధంతి సందర్భంగా హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ తోట వెంకటేశ్వర్లు, పీసీసీ సభ్యుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఆరెపల్లి మోహన్, నాయకులు బంక సరళ, నాయిని లక్ష్మారెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, ఏనుకోటి పున్నం పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పీఈటీ, పీడీలకు శిక్షణ : డీవైఎస్‌ఓ

వరంగల్: గ్రామ, మండల, జిల్లాస్థాయి సీఎం కప్-2024 పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, పీడీలకు అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించినట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి టీవీఎల్.సత్యవాణి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమావేశంలో డీవైఎస్‌ఓ మాట్లాడారు.

కొత్తపేటలో ప్రపంచ మృత్తిక దినోత్సవం

దేశాయిపేట: వరంగల్ వ్యవసాయ కళాశాల దత్తత గ్రామం కొత్తపేటలో గురువారం ప్రపంచ మృత్తికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు నేల ప్రాముఖ్యం, సారవంతాన్ని పెంచే పద్ధతులు, నేల కాలుష్య నివారణకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు.

శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం

మామునూరు: శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మామునూరు ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. సీపీ అంబర్ కిషోర్ ఝా, ఏసీపీ తిరుపతి సూచనల మేరకు మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని లెనిన్‌నగర్‌తోపాటు స్లమ్ ఏరియాల్లో ఎస్సైలు కృష్ణవేణి, శ్రీకాంత్ ఆధ్వర్యంలో మూడు కిరాణం షాపుల్లో నిషేధిత పొగాకు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఖమ్మం రహదారిపై వాహన తనిఖీ చేశారు.

హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలి

దేశాయిపేట / ఖిలా వరంగల్: రాష్ట్రంలోని హోంగార్డుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం వారి సమస్యలను గాలికి వదిలేసి, వారితో వెట్టి చాకిరీ చేయించుకుని వారి కనీసం అవసరాలు కూడా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

సమస్యలు అడగడానికి వెళ్తే అరెస్ట్ చేశారు

హసన్‌పర్తి: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సమస్యలు తెలుసుకోవడానికి వెళ్తే పోలీసులు అరెస్ట్ చేశారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ వాపోయారు. స్థానిక కార్పొరేటర్ గుగులోతు దివ్యారాణి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర, మాజీ సర్పంచ్ కుమారస్వామి, నాయకులు నాగరాజు, శ్రీనివాస్, వీరస్వామి, రాకేష్, శ్రీకాంతాచారి పాల్గొన్నారు.

7న ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలి

వరంగల్ చౌరస్తా: కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువై 60 మంది మృత్యువాత పడ్డారని డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈసంపెల్లి సంజీవ ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 7న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త ఆటోల బంద్ వాల్‌పోస్టర్లను వరంగల్ చౌరస్తా అడ్డాలో గురువారం విడుదల చేశారు. ప్రధాన కార్యదర్శి మంద శ్రీధర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మడికొండ బాబు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కలకోట్ల జయరాం, జేఏసీ ఉపాధ్యక్షుడు బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కేయూ క్యాంపస్: బీఆర్‌ఎస్ నేతల అరెస్టు అక్రమమని ఖండిస్తూ కాకతీయ యూనివర్సిటీ బీఆర్‌ఎస్వీ శాఖ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటిగేట్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ కేయూ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్, నాయకుడు డాక్టర్ పాలకుల కొమురయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా భారత్ రాష్ట్ర సమితి ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి తన అధికార బలంతో పోలీసులను అడ్డుపెట్టుకొని బీఆర్‌ఎస్‌ను ఇబ్బందులకు గురిచేసేవిధంగా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్వీ హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అరూరి రంజిత్, బాధ్యులు కలకోట్ల సుమన్ పాల్గొన్నారు.

'మాలలకు కొమ్ముకాస్తున్న సీఎం'

కాజీపేట అర్బన్: సుప్రీంకోర్టు తీర్పుకనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా మాలలకు కొమ్ముకాస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ మంద రాజుమాదిగ సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ మాదిగ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశానికి మంద రాజు మాట్లాడారు.

తప్పకుండా హెల్మెట్ ధరించాలి

నయీంనగర్: ప్రతిఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని రోడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ (సీఆర్‌ఎస్‌బీ) బి.శ్రీనివాస రావు సూచించారు. కిషన్‌పుర చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథిగా పాల్గొన్న ఒడిశా ఇంటర్నేషనల్ సైక్లిస్ట్ సంతోష్ మిశ్రా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుండాలని అన్నారు. నేషనల్ సైక్లిస్ట్ సత్యానంద్ త్రిపాఠి, ఆర్‌ఎస్ఐ నవీన్‌కుమార్, ఏఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకు సైన్స్‌ఫేర్

వరంగల్ చౌరస్తా: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్‌ఫేర్ ఎంతగానో దోహదపడుతుందని ఐఎంఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజిత్ కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం నాయకుడు తుమ్మ వీరయ్య అన్నారు. వరంగల్ 26వ డివిజన్‌లోని సరస్వతి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో సైన్స్‌ఫేర్, ప్లానిటోరియం కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. 300 ఎగ్జిబిట్లను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మార్త యుగేందర్, ప్రతినిధులు ఎండీ.మదర్ సాహెబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్వోఆర్ చట్టాన్ని అమల్లోకి తీసుకురావాలి

హసన్‌పర్తి: ఆర్వోఆర్ చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి కోరారు. ఈమేరకు వరంగల్ పర్యటనకు వచ్చిన రైతు వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డిని గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రుణమాఫీ కానివారికి రూ.2 లక్షలు మాఫీ చేయాలని కోరారు.

ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలి

న్యూశాయంపేట: విద్యార్థుల తల్లిదండ్రులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన జక్కలొద్ది మైనారిటీ గురుకులం ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి రమేష్‌కు గురువారం వినతిపత్రాలు అందించారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

హసన్‌పర్తి: కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డిని పలు పార్టీల నాయకులు పరామర్శించారు. ఇటీవల వెంకట్రామ్ నర్సింహారెడ్డి తల్లి సౌదామిని అనారోగ్యంతో మృతిచెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, టెస్కాబ్ రాష్ట్ర చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మన్లు బిల్లా ఉదయ్ కుమార్‌రెడ్డి, జక్కు రమేష్, మాజీ సర్పంచ్ మదన్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అనిల్‌రెడ్డి, నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, కిరణ్ ఓదార్చారు.

శ్రీవల్లి సమేత సుబ్రహ్మణ్య చల ప్రతిష్ఠాపన

వరంగల్: స్కంద షష్ఠిని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయంలో శ్రీవల్లి సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయంలో నూతన శ్రీవల్లి సమేత సుబ్రహ్మణ్య స్వామి పంచలోహ విగ్రహాలకు అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు చేసి చల ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమంలో విగ్రహాల దాతలు జంగం రాజు, రమాదేవి, మండల చంద్రశేఖర్, భవాని, అర్చకులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ దేవాలయంలో పూజలు

వరంగల్: ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య గురువారం తన జన్మదినాన్ని పురస్కరించుకుని కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు స్వాగతం పలికి సన్మానించారు.

పత్తిని సీసీఐ కొనుగోలు చేయాలి

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు బస్తాల్లో తెచ్చిన పత్తిని కూడా విధిగా సీసీఐ కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ కోరారు. ఈమేరకు మార్కెట్‌ను సందర్శించిన రైతు కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

కాశీలో జిల్లా కళాకారుల నృత్య ప్రదర్శన

వరంగల్: కాశీలో జిల్లాకు చెందిన వెంపటి కళాక్షేత్రానికి చెందిన నాట్య కళాకారులు గురువారం కాశీలోని అస్సీఘాట్‌లో మేడిపెల్లి లక్ష్మీ అనూఘ్య, సతీష్, స్వప్నశ్రీ, రుషికిరాన, రఘు, సారిక, వైష్ణవి తదితరులు నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు.

ఇద్దరు నకిలీ వైద్యులపై కేసు నమోదుకు చర్యలు

రామన్నపేట: ఎలాంటి విద్యార్హత లేని నకిలీ వైద్యులు రామకృష్ణ, వీరమల్లులపై కేసు నమోదు చేయనున్నట్లు టీజీఎంసీ వైద్య బృందం తెలిపింది. నకిలీ వైద్యులు చేతిలో వైద్యం వికటించి సంరక్ష ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇటినేని సూరయ్యను మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేష్‌కుమార్, సభ్యుడు డాక్టర్ శేషుమాధవ్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ అన్వర్‌మియా, డాక్టర్ దిలీప్ పరామర్శించారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి స్వాగతం

కాజీపేట: యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కేఆర్.దిలీప్‌కు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కాజీపేట చౌరస్తాలో గురువారం ఘన స్వాగతం పలికారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల రమాకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో దిలీప్‌కు స్వాగతం పలికి సన్మానించారు.